## క్లుప్తంగా

### చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకటేశ్వరస్వామి



**బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చి నగర పంచాయతీలోని రామకృష్ణ నగర్‌లో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది.

### కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



**పొదలకూరు :** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం మహాశివరాత్రి సందర్భంగా తొలుత వేదపండితుల స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. నిర్వాహకులు మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

### బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

**వెంకటాచలం :** మోటారు బైక్ అదుపుతప్పి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన కృష్ణప్రసాద్ పని నిమిత్తం కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కసుమూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కృష్ణప్రసాద్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పంచాయతీ విద్యుత్ బకాయిల చెల్లింపు

**పొదలకూరు :** మేజర్ పంచాయతీ పొదలకూరు విద్యుత్ బకాయిలు చాలాకాలంగా చెల్లించకపోవడంతో అధికారులు వీధిలైట్లకు సరఫరాను కట్ చేసిన విషయం తెలిసిందే. అయితే పంచాయతీ నుంచి తొలివిడతగా రూ.20 లక్షల బకాయిలను చెల్లించినట్లు సెక్రటరీ శ్రీనివాసులు వెల్లడించారు. గురువారం వీధిలైట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తారన్నారు.

### చోరీకి యత్నించి.. పక్కరోజు అక్కడే తిరిగి

**బుచ్చిరెడ్డిపాళెం :** ఓ వ్యక్తి చోరీకి యత్నించి.. పక్కరోజు అక్కడే తిరిగి పట్టుబడిన ఘటన బుచ్చి పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న చోళం నారాయణ అనే వ్యక్తి ఇంటి వద్ద జెండాదిబ్బకు చెందిన చోటూ అనే యువకుడు మంగళవారం అర్ధరాత్రి సీసీ కెమెరాను ధ్వంసం చేసి ఇంట్లో నిద్రిస్తున్న సుదర్శనమ్మ అనే మహిళ మెడలోని బంగారు సరుడును తెంచేందుకు యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో గోడ దూకి పరారయ్యాడు. అనంతరం బుధవారం ఉదయం ఏమీ తెలియనట్లు అదే ఇంటికి రాగా సుదర్శనమ్మ దొంగను గుర్తించడంతో చోటూను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ చోటూ గతంలో వారి ఇంటి వద్ద పనిచేసిన వ్యక్తి అని తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు : ప్రభగిరిపట్నంలోని కైలాసనాథస్వామి



మనుబోలు: శివలింగానికి ప్రత్యేకాలంకరణ



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో పార్వతీదేవి



బుచ్చిరెడ్డిపాళెం: త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో..



ఇందుకూరుపేట : భారీ శివలింగాన్ని అభిషేకిస్తున్న భక్తులు



# సర్వం.. శివోహం

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- నేత్రపర్వంగా శివరాత్రి వేడుకలు

**హరహర మహాదేవ శంభోశంకర అనే నామ స్మరణతో శైవక్షేత్రాలు హోరెత్తాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు బుధవారం భక్తులతో హోరెత్తాయి. ఉదయం నుంచే భక్తులు శైవక్షేత్రాలకు వెళ్లి పూజలు చేశారు. పరమ శివునికి అభిషేకాలు చేసి దీపాలు వెలిగించి పూజలు గావించారు.**



పొదలకూరు శివాలయం ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో జాగరణ చేసేందుకు వచ్చిన భక్తులు

పొదలకూరు : మహా శివరాత్రి పర్వదినం బుధవారం శైవక్షేత్రాలు భక్తుల సందర్శనతో కిటకిటలాడాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన పొదలకూరులోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. నేత్రపర్వంగా శివరాత్రి మహోత్సవ వేడుకలను నిర్వహించారు. రంగురంగుల విద్యుద్దీప కాంతులతో దేవస్థానాన్ని ముస్తాబు చేశారు. మహిళలు దేవస్థానం ప్రాంగణంలో ప్రమిదలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివాలయం ప్రాంగణంలోనే విఘ్నేశ్వరాలయం, అయ్యప్పస్వామి దేవస్థానం ఉండడంతో భక్తుల తాకిడి అధికమైంది. ప్రధాన అర్చకుడు పీబీఎస్వీ ప్రసాద్‌స్వామి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకపూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాదాలను అందజేశారు. రాత్రి నందిసేవ ఉభయకర్తలుగా పొదలకూరు రైతు సంఘం వ్యవహరించింది.

**మరుపూరులో..**

మరుపూరులోని కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేకపూజలు, భక్తులకు తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం స్వామిఅమ్మవార్ల కల్యాణం, అన్నదాన కార్యక్రమం, రాత్రి వైభవంగా స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం ఉంటుందన్నారు. గ్రామపెద్ద వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పీజీపట్నంలో..**

చారిత్రక ప్రదేశం ప్రభగిరిపట్నంలోని కైలాసనాథ స్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవ వేడుకలను నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కైలాసనాథస్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పార్వతిదేవికి చందనాలంకారం, పూజలు, తీర్థప్రసాద వినియోగం జరిగింది.

**చెన్నారెడ్డిపల్లిలో..**

చెన్నారెడ్డిపల్లిలోని పంచలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, సాయంత్రం స్వామి అమ్మవార్లకు కల్యాణాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**మండల పరిధిలో..**

➡ **ముత్తుకూరు :** మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పరమేశ్వరుడి ఆలయాలు భక్తుల సందర్శనతో బుధవారం కిక్కిరిసిపోయాయి. ఇందులో భాగంగా కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. కామాక్షి సమేత సిద్ధేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు ఆచరించారు. బ్రహ్మదేవిలోని కైలాసనాథేశ్వరాలయం వేకువజాము నుంచే భక్తులతో కిక్కిరిసిపోయింది. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. దివంగత మాజీ ఎంపీపీ మెట్ట చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. వల్లూరు శివాలయంలో దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ముత్తుకూరు, పిడతాపోలూరులోని శివాలయం, ఈపూరులోని విరూపాక్షేశ్వరాలయం, పైనాపురంలోని భోగేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.

**సంగమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు**

➡ **మనుబోలు :** మండల పరిధిలోని మనుబోలు, చెర్లోపల్లి, మడమనూరు, పిడూరు, వెంకన్నపాళెం, బద్దెవోలు, పిడూరుపాళెం, కొలనకుదురు తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. కొబ్బరికాయలు, పండ్లు పూలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బద్దెవోలు రోడ్డు మార్గంలో కండలేరు ఒడ్డున వెలసిన కామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయానికి భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. మనుబోలు శివాలయంలో అర్చకుడు ఫణీంద్రశర్మ, సంగమేశ్వరాలయంలో సాయిశర్మ స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు చేశారు.

**వైభవంగా శివపార్వతుల కల్యాణం**

కామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి– శశికళ, అవినాష్‌రెడ్డి– ఉద్దీప దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మనుబోలు యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా కల్యాణాన్ని పురస్కరించుకుని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

**మార్మోగిన ఉదయకళేశ్వరాలయం**

➡ **కొడవలూరు :** మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి ఆలయం బుధవారం శివనామ స్మరణతో మార్మోగిపోయింది. ఉదయపు సూర్య కిరణాలు నేరుగా స్వామివారిపై పడడం ఇక్కడి విశేషం. దీంతో దేవస్థానంలోని కోనేరులో స్నానమాచరించి ఉదయకళేశ్వరుని దర్శించుకొంటే సుఖసంతోషాలు సిరి సంపదలు వస్తాయని బుధవారం భక్తులు పోటెత్తారు. మహిళలు ధ్వజ స్తంభానికి దీపాలు వెలిగించి శివనామస్మరణతో తరించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి గిన్నె భిక్ష అత్యంత వేడుకగా నిర్వహించారు. అర్చకుడు బండారు సుబ్రహ్మణ్యం స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బండి శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐ ఎ.సురేంద్రబాబు, కొడవలూరు, విడవలూరు ఎస్సైలు సీహెచ్.కోటిరెడ్డి, పి.నరేష్ యాదవ్‌లు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ బి.రాజకుమారి, ఉత్సవ కమిటీ సభ్యుడు గుడ్రం భవాని, స్థానిక నాయకులు పెనాక వెంకటేశ్వర్లురెడ్డి, బి.సురేష్ పాల్గొన్నారు.

**గంగపట్నంలో..**

➡ **ఇందుకూరుపేట :** మండలంలోని గంగపట్నం తారకేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి మండపంలో కొలువు దీర్చి మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉభయకర్తలుగా స్థానికులు కర్పూరం హైమావతమ్మ, కుమారుడు శివకుమార్ రెడ్డి వ్యవహరించారు. మైపాడులోని అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో లింగోద్భవ అభిషేకం జరిగింది. ఉభయకర్తలుగా కొండా అనిల్‌కుమార్, సాయిగీత వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం జరిగింది. కాగా తీరంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, భారీ శివలింగానికి అభిషేకాలు జరిపారు. పల్లిపాడులోని రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అభిషేకాలు, కల్యాణోత్సవం జరిగింది. ఇందుకూరుపేట, కొత్తూరు, ముదివర్తిపాళెం గ్రామాల్లోని శివాలయాల్లో విశేష పూజలు జరిగాయి.

**కాటేపల్లి తీరం భక్తజన సంద్రం**

➡ **తోటపల్లిగూడూరు :** మండలంలోని కాటేపల్లి శివాలయం, కోడూరు శివాలయం, తోటపల్లిగూడూరులోని ఖరేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కాటేపల్లి సముద్రతీరాన వెలిసిన కామాక్షిదేవి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వేడుకగా సాగాయి. జిల్లా నలువైపుల నుంచి భక్తులు కాటేపల్లి శివాలయానికి తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా మహిళలు ఆలయంలో పిండి దీపారాధనలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో స్వామివారి దర్శనానికి సుమారు రెండు గంటలకుపైగా సమయం పట్టింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాటేపల్లి రహదారులు కిటకిటలాడాయి. స్వామివారి దర్శనాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడి నెలకొంది. అలాగే ప్రతి ఏడాది లానే మండపం పంచాయతీ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం వేలాది మంది భక్తులకు ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. నెల్లూరు ఆర్టీసీ–2 డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడిచాయి. ఎస్సై వీరేంద్రబాబు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

**పుణ్యస్నానాలు నేడు**

మహాశివవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి భక్తులు ఆలయ ప్రాంగణంలో రాత్రి జాగరణలు చేయనున్నారు. ఈ క్రమంలో గురువారం వేకువ జాము నుంచి కాటేపల్లి సముద్ర తీరంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేయనున్నారు. ఇందుకు పోలీస్‌శాఖ, ఆలయ కార్యనిర్వాహకులు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు.

**జొన్నవాడలో..**

➡ **బుచ్చిరెడ్డిపాళెం :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో రాత్రి జాగరణ కోసం భక్తులు పోటెత్తారు. లింగోద్భవ అభిషేకం అర్ధరాత్రి జరుగుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

➡ మండలంలోని పెద్దూరు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, వవ్వేరులోని త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం, ఇస్కపాళెంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో, దామరమడుగు శివాలయంలో, రేబాల, కాగులపాడు, మినగల్లు శివాలయాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కనిగిరి రిజర్వాయర్ వద్దనున్న శివలింగం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి.

➡ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి, అమ్మవార్లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, నవావరణ పూజలు, ప్రత్యేక పుష్పాలంకరణ, వెండినందిసేవ, గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

➡ **విడవలూరు :** మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన కామాక్షితాయి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సమీపంలోని సముద్రంలో భక్తులు స్నానాలు ఆచరించి, సైకత శివలింగాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు పేరేపి శ్రీకాంత్‌శర్మ స్వామివారికి ప్రత్యేక అలంకారణ గావించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.



పొదలకూరు శివాలయ ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు



ముత్తుకూరు : కృష్ణపట్నం శివాలయంలో భక్తుల క్యూ



ముత్తుకూరు : బ్రహ్మదేవి శివాలయంలో..



కొడవలూరు : ఉదయకళేశ్వరాలయంలో..



కొడవలూరు : స్వామివారి సేవలో ఎస్పీ కృష్ణకాంత్



కొడవలూరు : స్వామివారి గ్రామోత్సవం

### వైభవంగా గ్రామోత్సవం

**పొదలకూరు :** పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రావణసేవను మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా దేవాంగ సంఘం వ్యవహరించింది. ఉత్సవాల అంకురార్పణ తర్వాత రాత్రి ధ్వజారోహణ, రావణసేవ గావించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కాయకర్పూరం సమర్పించారు.



### కల్యాణోత్సవం



ఇందుకూరుపేట : గంగపట్నంలో..



మనుబోలు: సంగమేశ్వరాలయంలో జరుగుతున్న శివపార్వతుల కల్యాణం



ఇందుకూరుపేట : మైపాడు శివాలయంలో..



బుచ్చిరెడ్డిపాళెం : శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



టీపీ గూడూరు : కాటేపల్లి శివాలయంలో..



టీపీ గూడూరు : కాటేపల్లి శివాలయంలో అన్నదానం



విడవలూరు : రామతీర్థం గ్రామంలో..

# హోరాహోరీగా ఎడ్ల పందేలు

- విజేత అల్లూరు జట్టు

**కోవూరు :** మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని లేగుంటపాడులో రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందేలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. దివంగత గుణపాటి తులసీరామ్‌రెడ్డి జ్ఞాపకార్థం జరిగిన పోటీలను రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం 35 జతల ఎడ్లకు పోటీ జరగ్గా, జిల్లాలోని అల్లూరుకు చెందిన ఎస్ఎస్ బ్రదర్స్ వారు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. రెండో స్థానంలో తూర్పుగోదావరి జిల్లా గుమ్మలేరుకు చెందిన చౌదరి ఎద్దు, మూడో స్థానంలో కోవూరుకు చెందిన చెన్నకేశవ ఎద్దు నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.50 వేల నగదును గుంటూరుకు చెందిన మిత్రారెడ్డి స్నేహితులు అందజేశారు. కాగా ఎడ్ల పోటీలను తిలకించేందుకు భారీస్థాయిలో ప్రజలు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ట్రైయినీ డీఎస్పీ శివప్రియ, ఎస్సై రంగనాథ్‌గౌడ్ తగిన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గుణపాటి హరిప్రసాద్‌రెడ్డి, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



మొదటి బహుమతిని అందుకుంటున్న అల్లూరు జట్టు

# కళే.. జీవనగమ్యం

- పండరి భజన తొలి మహిళా గురువుగా వెంకటాచలానికి చెందిన లక్ష్మీసాయి
- వెయ్యి మందికిపైగా శిక్షణ

**నెల్లూరు (బృందావనం):** సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ.. పండగలు, జాతర్లలో పండరిభజనలు, కోలాటాలపై మక్కువ పెంచుకున్న ఆమె పసిప్రాయం నుంచే సాధనను ప్రారంభించారు. ఏ విద్యయినా గురు ముఖంగానే సాధన చేయడం పరిపాటి. అయితే ఆమె ఆ కళ సాధనలో నైపుణ్యాలను ఆకళింపు చేసుకొని తనకు తానే గురువుగా, శిష్యురాలిగా నేర్చుకున్నారు. ఏడేళ్ల వయస్సులోనే పండరిభజనలో అగ్నిగుండాన్ని తొక్కి ఔరా అనిపించుకున్నారు. ఆ తర్వాత మరింత కళా నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ మరొకరికి కళను నేర్పే గురువుగా మారారు. ఈ కళపై ఆసక్తి ఉన్న వారికి వివాహానంతరం సైతం శిక్షణ ఇస్తూ.. ఎన్నో వేదికల్లో తన శిష్య బృందంతో పండరిభజనలు, కోలాటాలతో అలరిస్తున్నారు. పండరి భజనలో దాదాపు వెయ్యి మందికిపైగా శిక్షణనిస్తూ తొలి మహిళా గురువుగా లక్ష్మీసాయి కీర్తి ప్రతిష్టలను అందుకుంటున్నారు. బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిర వ్యవస్థాపక ధర్మకర్తల్లో ఈమె ఒకరు.

**కళలపై చిన్నతనం నుంచే మక్కువ**

**వెంకటాచలం మండలం** కాకుటూరుకు చెందిన లక్ష్మీసాయి చిన్నతనంలో ఏ కార్యం జరిగినా పండరి భజనలు, కోలాటాన్ని నిర్వహించేవారు. కళలపై మక్కువ పెంచుకున్న ఆమె ఏకలవ్య శిష్యురాలిగా స్వీయ సాధనతో పండరి భజనలు, కోలాట కళలను నేర్చుకున్నారు. ముత్తుకూరుకు చెందిన మధుసూదన్‌రావుతో 21 ఏళ్ల ప్రాయంలో వివాహమైంది. ఇద్దరూ సాయినాథుడి భక్తులు కావడంతో జీవనయానంలో భాగంగా మరో పదేళ్లకు నెల్లూరు చేరారు. సాయిదర్బార్ అద్దాల మందిరాన్ని అకుంఠిత దీక్ష, భక్తిప్రపత్తులతో దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు 23 ఏళ్లుగా సాయిదర్బార్ అద్దాల మందిరంలో ప్రతి గురువారం జరిగే పల్లకి ఉత్సవంలో పండరి భజనలు, కోలాటాలు చేస్తూ కళను కొనసాగిస్తున్నారు.



శిక్షణ పొందిన మహిళలతో లక్ష్మీసాయి (ఫైల్)

**ఉచితంగా శిక్షణ**

పండరి భజనపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ఒక్క రూపాయి తీసుకోకుండా తొలి విడతగా 100 మందికి శిక్షణను అందించారు. వీరితో పండరి భజనలను ప్రతి గురువారం నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యి మందికి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. సాయిదర్బార్ అద్దాల మందిరంలో అగ్నిగుండ మహోత్సవాలను మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏ ఉత్సవం జరిగినా పండరి భజనలు, కోలాటాలను నిర్వహిస్తూ ఎందరో అభినందలు అందుకుంటున్నారు. పండరీపురంలో పాండురంగడ్ని స్మరిస్తూ పండరీ భజనను చేపట్టడం దివ్యానుభూతి అని ఆమె చెప్పారు.